క్లుప్తంగా

గ్రంథాలయ నిర్మాణానికి రూ.50 వేల విరాళం

దొనకొండ: మండలంలోని చందవరంలో గ్రామస్తుల సహకారంతో నూతనంగా గ్రంథాలయం ఏర్పాటు చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ బండారు రాజు తన వంతు గ్రంథాలయ నిర్మాణానికి రూ.50 వేలు విరాళం అందజేశారు. ఇంకా దాతలు ముందుకు వచ్చి నూతన గ్రంథాలయ నిర్మాణంకు తోడ్పాటు అందించాలని గ్రామస్తులు కోరారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు


పోలేరమ్మ అమ్మవారు

మార్కాపురం టౌన్: మార్కాపురం శివారులోని ప్రసిద్ధ అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు, కుంకుమార్చన అనంతరం ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్నకేశవ రెడ్డి, ఆలయ చైర్మన్, ధర్మకర్తలు, సిబ్బంది శ్రీధర్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

ఆదమరిస్తే అంతే సంగతులు


ప్రమాదకరంగా వెళుతున్న ప్రయాణికులు

దొనకొండ: నూతన సంవత్సరంలో పంట పొలాలు కాపు రావటంతో కూలీలకు గిరాకీ పెరిగింది. గ్రామాల నుంచి కూలీలు విచ్చలవిడిగా ఆటోల్లో ప్రయాణిస్తున్నారు. ఆదమరిస్తే అంతే సంగతులు. పాఠశాలలకు సెలవులు రావటంతో చిన్నారులు కూడా తల్లిదండ్రుల వెంట కూలీ పనులకు వెళ్తున్నారు. ఆటోల్లో పైన కింద కూర్చుని కూలీ పనులకు వెళ్తున్నారు. ప్రమాద సంఘటన జరిగితే అంతే సంగతులు.

గానాల రామ్మూర్తి సేవలు మరువలేనివి


గానాల రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

దర్శి: గానాల రామ్మూర్తి సేవలు మరువలేనివని విశ్వబ్రహ్మణ సంఘం నాయకులు గొల్లపాటి శ్రీనివాసాచారి అన్నారు. దర్శి పట్టణంలో ఆ సంఘం నాయకులు గానాల రామ్మూర్తి జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు సోడా చంద్రశేఖర్, నడింపల్లి స్వరూపాచారి, పోలేపల్లి విశ్వరూపాచారి పాల్గొన్నారు.

నేడు, రేపు క్రైస్తవ ఉజ్జీవ మహాసభలు

దర్శి: పట్టణంలోని జూనియర్ కళాశాల ప్రాంగణంలో సోమ, మంగళవారాల్లో దర్శి క్రైస్తవ ఉజ్జీవ మహాసభలు జరుగుతున్నట్లు నిర్వాహకులు బేతేలు క్రిస్టియన్ అసెంబ్లీ పాస్టర్ కోలా ఇజ్రాయేల్ తెలిపారు. ఈ సభల్లో అంతర్జాతీయ సువార్త గాయకులు సింఫనీ గాస్పెల్ టీం డైరెక్టర్ ఏఆర్ స్టీవెన్‌సన్ పాల్గొని క్రైస్తవ గీతాలు ఆలపిస్తారని తెలిపారు. ప్రముఖ దైవ జనులు బ్రదర్ పి. విల్సన్ , అబ్రహం పాల్గొని దైవ సందేశాలు అందిస్తారన్నారు. మంగళవారం జరిగే సభలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పాల్గొంటారన్నారు.

విద్యుత్ మోటార్లలో కేబుల్ వైర్లు చోరీ

గుడ్లూరు: పొలాల్లో 9 విద్యుత్ మోటార్లకు ఉన్న కేబుల్ వైర్లు చోరీకి గురయ్యాయి. ఈ సంఘటన మండలంలోని గుండ్లపాలెం, గుడ్లూరు గ్రామాల్లో శనివారం అర్ధరాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే.. గుడ్లూరుకు చెందిన రైతులు వెంకటేశ్వర్లు, క్రిష్టారావు, బాలక్రిష్టారెడ్డి, ప్రదీప్‌లు కొత్తపేట దగ్గర ఉన్న తమ పొలాలకు నీళ్లు పెట్టుకోవడానికి సోమవారం ఉదయం వెళ్లగా అక్కడ నాలుగు విద్యుత్ మోటార్లకు ఉన్న కేబుల్ వైర్లు చోరీకి గురై ఉండటాన్ని గమనించారు. అపహరణకు గురైన కేబుల్ వైర్లు విలువ రూ.20 వేలు ఉంటుందని బాధిత రైతులు తెలిపారు. అలాగే గుండ్లపాలెంలో కిషోర్ మరో నలుగురు రైతులకు చెందిన పొలాల్లో 5 విద్యుత్ మోటార్లలో ఉన్న కేబుల్ వైర్లు చోరీకి గురయ్యాయి. వాటి విలువ రూ.25వేలు ఉంటుందని బాధిత రైతులు వాపోయారు. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రైతులు తెలిపారు.

వైభవంగా శోభాయాత్ర


కురిచేడు: శ్రీ రామస్వామి మూలవిరాట్


రామనామ పారాయణం చేస్తున్న భక్తులు


శోభాయాత్ర నిర్వహిస్తున్న హిందువులు

గిద్దలూరు రూరల్: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా గిద్దలూరు నియోజకవర్గ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో హిందువులు పట్టణంలోని మహాత్మా గాంధీ సెంటర్ నుంచి ఆదివారం శోభా యాత్రను వైభవంగా నిర్వహించారు. ఈ యాత్ర గాంధీబొమ్మ సెంటర్ నుంచి అమ్మవారిశాల, షరాబ్‌బజారు, అభయాంజనేయ స్వామి ఆలయం మీదుగా శ్రీవేణుగోపాలస్వామి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. మహిళలు దీపాలు వెలిగిస్తూ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వందల సంవత్సరాల నుంచి హిందువుల కోరిక నేటితో నెరవేరనున్నదని అటువంటి మహత్తర పుణ్య కార్యక్రమాన్ని మనం చూడబోతున్నందుకు ఎంతో అదృష్టవంతులమని వ్యాఖ్యానించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు చేరెడ్డి ఎర్రారెడ్డి, నిర్వాహకులు బొరుగుల బట్టి బాలక్రిష్టారెడ్డి, దండెబోయిన రమణ, సూరే క్రిష్టారావు, ఓ.వెంకటయ్య యాదవ్, అనసూయ, పద్మ, డాక్టర్ జేవీ నారాయణ, పిడతల రమేష్‌రెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు

కురిచేడు: అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా మండలంలోని రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మండలంలోని పొట్లపాడులోని రామాలయంలో ఆదివారం ఏకాహం, సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, కళ్యాణం నిర్వహిస్తున్నటుల ఆలయపూజారి కొండవీటి ప్రసాదాచార్యులు తెలిపారు.

ఘనంగా రామనామ పారాయణం

మార్కాపురం టౌన్: అయోధ్య రామ మందిరంలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానంలో రెండో రోజు ఆదివారం అఖండ రామనామ సంకీర్తన పారాయణాన్ని మహిళా భక్తులు నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 వరకు రామనామ పారాయణం చేయగా.. ఆలయ అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు పూజలు నిర్వహించారు. ఈఓ జి.శ్రీనివాసరెడ్డి, ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి


క్రికెట్‌లో గెలుపొందిన క్రీడాకారులు


బాలికల ఖోఖో విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

- నగర పంచాయతీ కమిషనర్ డానియల్ జోసఫ్
- ముగిసిన మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీలు

పొదిలి రూరల్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని నగర పంచాయతీ కమిషనర్ డానియల్ జోసఫ్ అన్నారు. పొదిలిలో ఆడుదాం..ఆంధ్ర మండల స్థాయి క్రీడా పోటీలు ఆదివారంతో ముగిశాయి. బహుమతుల ప్రదానోత్సవంలో కమిషనర్ మాట్లాడుతూ.. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని సూచించారు. క్రికెట్‌లో పురుషుల విభాగంలో పొదిలి సచివాలయం–3, మహిళా విభాగంలో పొదిలి సచివాలయం–6, వాలీబాల్ పురుషుల విభాగంలో పొదిలి–2, మహిళా విభాగంలో ఉప్పలపాడు సచివాలయం, ఖోఖో పురుషుల విభాగంలో మాదాలవారిపాలెం, పొదిలి–3 సచివాలయాలు, కబడ్డీ పురుషుల విభాగంలో పొదిలి–3, మహిళా విభాగంలో కొండాయపాలెం సచివాలయం, బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో పొదిలి–4, మహిళలు పొదిలి–2 సచివాలయం జట్లు గెలుపొందాయి. కార్యక్రమంలో జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ తారావాణి, ఎంఈఓలు ఎం.శ్రీనివాసరెడ్డి, నాగలక్ష్మి, బీవీ రెడ్డి, కరిమూన్ పఠాన్, పీడీలు షకీలా, అరుందతి, ప్రసాద్, నాయుడు,జివి సుబ్బారెడ్డి, ఉమా తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ సంఘం నూతన క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

దర్శి: బహుజన ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్‌ను ఆదివారం పంచాయతీ రాజ్ ఏఈ మొగిలి వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ఆవిష్కరించారు. బహుజన రచయిత అట్లూరి రామారావు అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. బహుజనులంతా ఏకతాటిపై నడిచి వారి విద్యా వ్యవస్థను ముందుకు తీసుకువెళ్ళేందుకు కృషి చేయాలని కోరారు. నాయకులు మీనిగ శ్రీనివాసరావు, గుర్రం మల్లిఖార్జున్, ఇట్లా వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, నాగార్జున విక్రమ్, జూపల్లి కోటేశ్వరరావు, తెనాలి రవిబాబు, వెంకటస్వామి, కొడవటి కోటేశ్వరరావు, బాబురావు, నాగేశ్వరరావు, శ్రీను ,రత్నం, కృష్ణ పాల్గొన్నారు.

పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి


తలమళ్ల సభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీకృష్ణ

పొదిలి రూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ పి.శ్రీకృష్ణ అన్నారు. పొదిలి మండలంలోని అన్నవరం, తలమళ్ల పంచాయతీల్లో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మాగాంధీ చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం ప్రధాని సందేశాన్ని చదివి వినిపించి, లబ్ధిదారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ కృష్ణ, నియోజకవర్గ వ్యవసాయ సలహా మండలి సభ్యులు కె.సుబ్బారావు, కొత్తపులి బ్రహ్మారెడ్డి, సర్పంచ్‌లు పులి శ్రీలత, తెల్లమేకల వెంకట సుబ్బమ్మ, పంచాయతీ కార్యదర్శులు శేషు, శేషగిరి, లేళ్ల శ్రీనివాసరెడ్డి, నర్మద, కొత్తపులి వెంకటేశ్వరరెడ్డి, ప్రజా ప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగిసిన ఆడుదాం ఆంధ్రా క్రీడలు


కబడ్డీలో విన్నర్స్‌గా గెలుపొందిన జేసీ అగ్రహారం జట్టు

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ ఆవరణలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఆదివారంతో ముగిశాయి. క్రికెట్‌లో విన్నర్స్‌గా బేస్తవారిపేట, కబడ్డీ పురుషుల, మహిళల విభాగంలో జేసీ అగ్రహారం, ఖోఖో పురుషుల విభాగంలో బేస్తవారిపేట, మహిళల విభాగంలో పిటికాయగుళ్ల, బాల్ బ్యాడ్మింటన్‌లో పురుషుల విభాగంలో బేస్తవారిపేట, మహిళల విభాగంలో పూసలపాడు జట్లు విన్నర్స్‌గా నిలిచినట్లు ఎంపీడీఓ పార్వతి తెలిపారు. మండల స్థాయిలో గెలుపొందిన జట్లను ప్రజాప్రతినిధులు, ఎంపీడీఓ, ఎంఈఓలు తదితరులు అభినందించారు.

ఇమ్మడిచెరువులో వికసిత్ భారత్ సంకల్పయాత్ర

వెలిగండ్ల: మండలంలోని ఇమ్మడిచెరువు, మోటుపల్లి గ్రామాల్లో ఎంపీడీఓ టి.సుకుమార్ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ టి.సుకుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి డిజిటల్ స్క్రీన్ ద్వారా వివరించారు. రైతులు పొలాలకు మందు ఎలా పిచికారీ డ్రోన్ సహాయంతో డెమో ద్వారా వివరించారు. సర్పంచులు గాలి తిరుపతిరెడ్డి, బాలయ్య, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీలు

లింగసముద్రం: మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులపై గ్రామాల్లో సామాజిక తనిఖీ అధికారులు విచారణ చేపట్టినట్లు ఏపీఓ సమీర్‌బాషా తెలిపారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ, గ్రామీణ నీటి పథకం, పంచాయతీరాజ్‌కు సంబంధించి జరిగిన పనులను డీఆర్పీల బృందం గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి కూలీలను విచారించి చేసిన పనులను తనిఖీలు నిర్వహిస్తారని చెప్పారు. విచారణ అనంతరం గ్రామాల్లో గ్రామ సభలను నిర్వహించి నివేదికను గ్రామ ప్రజలకు చదివి వినిపిస్తామన్నారు. అన్ని గ్రామాల్లో విచారణ పూర్తయిన తరువాత స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఎన్‌బీపాడులో భావనారుషి వేడుకలు

బల్లికురవ: మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామంలో భద్రావతీ సమేత భావనారుషి వార్షిక వేడుకలు ఆదివారంతో ముగిశాయి. వార్షికోత్సవంలో భద్రావతీ, భావనారుషి, ఆలయంలో లేనందున ప్రత్యేకంగా మండపం ఏర్పాటుతో మూడు రోజులుగా ప్రత్యేక పూజలు చేపట్టారు. వేడుకల్లో భాగంగా శనివారం రాత్రి వేషధారణ, గ్రామోత్సవం చేపట్టారు. ఆదివారం అన్నదానం నిర్వహించారు.

ఎటువంటి ఇబ్బందులున్నా చెప్పాలి

దర్శి: ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు, సమస్యలున్నా నేరుగా తనను కలిసి చెప్పుకుంటే వాటి పరిష్కార మార్గం చూపుతానని దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి అన్నారు. స్థానిక బూచేపల్లి నివాసంలో నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, నాయకులు కలిసి ప్రజా సమస్యలపై ఆదివారం చర్చించారు. పట్టణంలో అనారోగ్యంతో బాధపడుతున్న పార్టీ నాయకులు నాగేశ్వరరెడ్డిని పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలను తప్పని సరిగా కలుస్తానని చెప్పారు. ప్రతి ఒక్క ఓటు వైఎస్సార్‌సీపీకి ముఖ్యమే అన్నారు. ఎటువంటి అవసరాలున్నా కార్యకర్తలను కంటికి రెప్పలా చూసుకుంటానని చెప్పారు. కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ డైరెక్టర్, వైద్యవిభాగం అధికార ప్రతినిధి డాక్టర్ ఎస్ఎం బాషా, దొనకొండ మండల మాజీ కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, జేసీయస్ కన్వీనర్ గుంటు పోలయ్య, మాజీ ఎంపీపీలు పోశం మధు, కోట రామిరెడ్డి, మారం శ్రీనివాసరెడ్డి, భాస్కర్, రామకోటిరెడ్డి పాల్గొన్నారు.


నాగేశ్వరరెడ్డిని పరామర్శిస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

చెంచయ్య ఆశయాల కోసం పోరాడాలి


నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ కృష్ణ, నాయకులు

మార్కాపురం: కష్టజీవుల సమస్యల పరిష్కారం కోసం తుది శ్వాస వరకు అకుంటిత దీక్షతో పోరాడిన రావులపల్లి చెంచయ్య సేవలు మరువలేనివని మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ పేర్కొన్నారు. చెంచయ్య 18వ వర్ధంతి సందర్భంగా స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. జిల్లాలో తొలితరం కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా, ముఖ్యంగా వ్యవసాయ కూలీలు, రైతుల సమస్యలపై అకుంటిత దీక్షతో పోరాటాలు చేసిన వ్యక్తి చెంచయ్య అని కొనియాడారు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అందె నాసరయ్య మాట్లాడుతూ.. రావులపల్లి చెంచయ్య చేసిన పోరాటాలు పార్టీ కార్యకర్తలకు స్ఫూర్తిదాయకమన్నారు. అయ్యగానిపల్లి, మేడపి తదితర గ్రామాల్లో వ్యవసాయ కూలీలకు భూ పంపిణీ కోరుతూ పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపట్టి విజయవంతం చేశారన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్కే ఖాశిం, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు రేణుక, ఏపీడబ్ల్యూజే నాయకులు రమణ తదితరులు పాల్గొన్నారు.

గౌడ కుటుంబాలకు చేయూతనివ్వాలి


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న గౌడ సంఘ నాయకులు

మార్కాపురం టౌన్: ఆర్థికంగా వెనుకబడిన గౌడ కుటుంబాలకు సంఘం తరపున చేయూతనివ్వాలని జిల్లా గౌడ సంఘ ప్రధాన కార్యదర్శి కీర్తి సాయన్నగౌడ్ పేర్కొన్నారు. ఆదివారం ఎన్‌జీఓ హోమ్‌లో నియోజకవర్గ గౌడ సంఘ క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది పదో తరగతి చదువుతున్న గౌడ విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే మార్కాపురం నియోజకవర్గంలో గౌడ సంఘానికి స్థల సేకరణ చేయాలని కోరారు. గుంటూరులో ఉన్నటువంటి గౌడ సంఘ హాస్టల్‌ను గ్రూప్–1, గ్రూపు–2, గ్రూపు–3 పరీక్షలకు ప్రిపేరయ్యే విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. గౌడ సంఘ కోశాధికారి నాగార్జునగౌడ్, తాడివారిపల్లి మాజీ సర్పంచ్ కంచర్ల కాశయ్యగౌడ్, పట్టణ గౌడ సంఘ అధ్యక్షుడు జి.రమణగౌడ్, ప్రధాన కార్యదర్శి డి.లక్ష్మయ్య గౌడ్, బీసీ సంఘ ప్రధాన కార్యదర్శి ఇ.రంగస్వామిగౌడ్ తదితరులు గౌడ సంఘ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గౌడ సంఘ నాయకులు కె.వెంకటేశ్వర్లు, కె.నడిపి వెంకటేశ్వర్లు, ఎ.కృష్ణగౌడ్, కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, చెన్నకృష్ణగౌడ్, వెంకటస్వామి, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్–2 అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ


గ్రూప్–2 మెటీరియల్ అందజేస్తున్న దృశ్యం

మార్కాపురం: ఆర్థిక ఇబ్బందులతో ఎవరూ విద్యకు, ఉద్యోగాలకు దూరం కాకూడదనే సంకల్పంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో అనేక విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని ఏ1 గ్లోబల్ ఇంజినీరింగ్ కాలేజీ చైర్మన్ డాక్టర్ ఎం.షంషేర్ ఆలీబేగ్ పేర్కొన్నారు. ఏ1 గ్లోబల్ కళాశాల ఆధ్వర్యంలో గ్రూప్–2 మైనార్టీ అభ్యర్థులకు స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ మైనార్టీల విద్యాభివృద్ధి కేంద్రం, మైనార్టీ సంక్షేమ శాఖ ఏపీ ప్రభుత్వం సహకారంతో మైనార్టీ వర్గానికి చెందిన ముస్లింలు, క్రిస్టియన్లు, బౌద్ధులు, జైనులు, పార్సీలు, సిక్కులు తదితర వర్గాల అభ్యర్థులకు గ్రూప్–2 ఉచితంగా శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రేస్ కోచింగ్ సెంటర్ గౌరవ సలహాదారు, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్కే మహమ్మద్ రఫీ, అభ్యర్థులు పాల్గొన్నారు.

శరవేగంగా కులగణన సర్వే


పొదిలి తూర్పుపాలెంలో సర్వేను పరిశీలిస్తున్న కమిషనర్


వెలుగొండ్రాయునిపల్లిలో కులగణన సర్వే..

పొదిలి రూరల్: పొదిలి నగర పంచాయతీలో అన్ని సచివాలయాల పరిధిలో కుల గణన సర్వే శర వేగంగా సాగుతోందని నగర పంచాయతీ కమిషనర్ డానియల్ జోసఫ్ తెలిపారు. ఆదివారం పొదిలి పట్టణంలోని తూర్పుపాలెం, ఆంజనేయ స్వామి గుడి పరిసర ప్రాంతాల్లో కుల గణన సర్వేను ఆయన పరిశీలించారు. సమాజంలో వివిధ సామాజిక వర్గాల స్థితిగతులు తెలుసుకోవడానికి సర్వే ఉపయోగపడుతుందన్నారు. పొదిలి పట్టణంలో 200 మంది సచివాలయ సిబ్బంది సర్వే చేస్తున్నట్లు చెప్పారు.

కొనకనమిట్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వేను సర్వే సిబ్బంది వేగంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ అద్దంకి శ్రీనివాసమూర్తి అన్నారు. ఆదివారం మండలంలోని వెలుగొండ్రాయునిపల్లి, పాతపాడు, నాయుడుపేట గ్రామంలో నిర్వహిస్తున్న కులగణన సర్వే తీరును పరిశీలించారు. ఇంటింటికీ వచ్చే సర్వే బృందానికి ప్రజలు సహకరించాలని కోరారు.

యాదవుల ఐక్యతకు కృషి

కందుకూరు: రాష్ట్రంలో యాదవ ఐక్యత, అభివృద్ధికి అఖిల భారత యాదవ మహాసభ కృషి చేస్తుందని మహాసభ జాతీయ ఉపాధ్యక్షుడు సోమ్ ప్రకాశ్‌యాదవ్ అన్నారు. అఖిల భారత యాదవ మహాసభ సమావేశంలో ఆదివారం స్థానిక పద్మావతి గెస్టు హౌస్‌లో నిర్వహించారు. రాష్ట్రంలో యాదవులను చైతన్యవంతం చేసేందుకు దాదాపు 1800 గ్రామాల్లో కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. అన్ని రంగాల్లో యాదవులను అభివృద్ధి చెందేలా మహాసభ తరుపున కృషి చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో కమిటీలు వేయనున్నట్లు తెలిపారు. బంకా దత్తాత్రేయ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్వరి, కార్యదర్శులు ఆంజనేయమూర్తి యాదవ్, పూర్ణచంద్రరావు, బాపట్ల జిల్లా అధ్యక్షుడు తాడిబోయిన లక్ష్మీప్రసాద్ యాదవ్, చీరాల నియోజకవర్గ అధ్యక్షుడు చిమటా నారాయణస్వామి, కందశ్రీకాంత్‌యాదవ్, మురళీకృష్ణ, సంగా రాముమాదవ్, బక్కమంతుల శ్రీను, మల్లికార్జున, సీహెచ్ రామారావు, కె.కిరణ్, బ్రహ్మయ్య పాల్గొన్నారు.